ఇండియా కూటమిని గెలిపించండి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్

విశాలాంధ్ర-గుంటూరు : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏను ఓడించి... ఇండియా కూటమిని గెలిపించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ పిలుపునిచ్చారు. గుంటూరు మల్లయ్య లింగం భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్లోబల్స్ ప్రచారం చేసుకోవడంలో మోదీని మించిన వారు లేరన్నారు. ఒకవైపు సామాన్య, మధ్యతరగతి ప్రజలు రెండు పూటల తినడానికి తిండి లేక చేయడానికి పని లేక నరకయాతన అనుభిస్తున్నారని, మరొవైపు ఆకలి మరణాలు చోటు చేసుకుంటుంటే మోదీ నాయకత్వాన దేశం వెలిగిపోతుందని ప్రచారం చేసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నరేంద్ర మోదీ కేంద్రంలో అధికారం చేపట్టిన తరువాత పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగిపోయాయయని, నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని అంటాయని చెప్పారు. వేల సంఖ్యలో పరిశ్రమలు మూతబడి కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 40 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా మార్చివేశారని అన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సులను కూడా అమలు చేయకుండా రైతులను దగా చేశారని విమర్శించారు. క్రైస్తవులు, ముస్లింలపై దాడులు పెరిగిపోయాయని, ప్రశ్నించే వారిపై దాడులకు పాల్పడుతున్నారని చెప్పారు. వేల సంఖ్యలో మత హత్యలు సైతం జరిగాయని ఆరోపించారు. అంబేద్కర్ రాజ్యాంగాన్ని మార్చి మనువాద సిద్ధాంతాన్ని రాజ్యాంగంగా తీసుకువచ్చే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. దేశ ఆర్థిక, పారిశ్రామిక రంగం సైతం కుదేలైందని అన్నారు. అంబానీ, అదానీ చేతుల్లోకి దేశ ఆర్థిక రంగం వెళ్ళిపోయిందన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ పతనానికి కారణమైన వారు ఒక్కరూ మినహా మిగిలిన వారందరూ గుజరాతీ పెట్టుబడిదారులేనని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలను సైతం మోసం చేశారని, తిరుపతి వెంకన్న పాదాల సాక్షిగా ఇచ్చిన ప్రత్యేక హోదా హామీని విస్మరిం చారన్నారు. విశాఖ రైల్వే జోన్, కడప ఉక్కు పరిశ్రమ, విభజన హామీలు విషయంలో కూడా దగా చేశారన్నారు. ఇటువంటి వారు మనకు అవసరమా ప్రజలు గుర్తించాలని అన్నారు.

నారా లోకేష్ కాన్వాయ్ తనిఖీ

విశాలాంధ్ర-తాడేపల్లి : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కాన్వాయ్‌ను ఉండవల్లి కరకట్ట వద్ద పోలీసులు ఆపారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో తనిఖీలు చేస్తున్నామని చెప్పడంతో ఆయన సహకరించారు. కాన్వాయ్‌లోని కార్లు అన్నింటినీ పోలీసులు తనిఖీ చేశారు. ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా ఏమీలేదని పోలీసులు నిర్ధారించిన తర్వాత కాన్వాయ్‌ను పంపించారు. తాడేపల్లిలోని అపార్ట్‌మెంట్ వాసులతో ముఖాముఖి కార్యక్రమానికి వెళ్తుండగా ఈ తనిఖీలు జరిగాయి.

జిల్లా ముస్లీం మైనారిటీ ప్రధాన కార్యదర్శి నియామకం

విశాలాంధ్ర-తెనాలి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి ఆశీస్సులతో గుంటూరు జిల్లా వైఎస్సార్‌సీపీ ముస్లీం మైనారిటీ ప్రధాన కార్యదర్శిగా తెనాలి పట్టణ 5వ వార్డు నందులపేటకు చెందిన షేక్ చాన్‌బాషాను నియమించినందున అతను సంతోషదాయకంగా తెనాలి నియోజకవర్గ శాసనసభ్యులు అన్నాబత్తుని శివకుమార్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తనను కార్యదర్శిగా నియమించడం హర్షనీయమని ఇందుకు సహకరించిన తెనాలి నియోజకవర్గ కార్యవర్గ సభ్యులకు శాసనసభ్యునకు కృతజ్ఞతలు తెలిపారు. వార్డు కౌన్సిలర్, పెచ్చింగ్, సుభాని, రహీం, స్వర్ణకార సంఘనాయకులు, ముస్లీం సోదరులు తదితరులు అభినందనలు తెలిపారు.

జగన్ అరాచక పాలనతో ఏపీ బ్రాండ్ దెబ్బతింది

విశాలాంధ్ర-తాడేపల్లి : జగన్ అరాచక పాలనతో ఏపీ బ్రాండ్ బాగా దెబ్బతిందని నారా లోకేష్ అన్నారు. బుధవారం కుంచనపల్లి అపర్ణ అపార్ట్‌మెంట్‌లో నిర్వహించిన బ్రేక్ ఫాస్ట్ విత్ లోకేష్ కార్యక్రమంలో టీడీపీ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి లోకేష్ పాల్గొన్నారు. లోకేష్ మాట్లాడుతూ కక్షపూరిత విధానాల కారణంగా రాష్ట్రానికి ఆదాయం సమకూర్చే అమర్ రాజా వంటి పరిశ్రమలు పొరుగు రాష్ట్రాలకు తరలివెళ్లాయన్నారు. 2019లో ప్రజావేదిక కూల్చివేతతో ప్రారంభమైన విధ్వంసం, ఇప్పటికీ కొనసాగుతూనే ఉందన్నారు. జగన్ దెబ్బకు ఏపీలో తప్ప వెనుకబడిన రాష్ట్రాలకైనా వెళతామనే పరిస్థితికి పారిశ్రామికవేత్తలు వచ్చారని తెలిపారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అపార్ట్‌మెంట్ వాసులు పెద్దసంఖ్యలో పాల్గొని లోకేష్‌తో ముఖాముఖి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు, దారా దాసు పాల్గొన్నారు.

అనుమతి పొందిన గ్లో-బోర్డులు తొలగించలేదు

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరి మున్సిపల్ కార్యాలయం పరిధిలోని అనుమతి పొందిన గ్లో-బోర్డులను తొలగించలేదని నగర పాలక సంస్థ కమిషనర్ నిర్మల్ కుమార్ తెలిపారు. మున్సిపల్ కార్యాలయం పరిధిలోని వాణిజ్య, వ్యాపార పరిధిలో 167 గ్లో-బోర్డులు మాత్రమే అనుమతి పొందాయన్నారు. ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ కార్పొరేషన్ చట్టం 1955 సెక్షన్ 622(2), 420, 421 ప్రకారం మున్సిపల్ కార్యాలయం నుంచి లేదా ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్ 63, జీవో 326 ప్రకారం వ్యాపార నిమిత్తం మాత్రమే గ్లో-బోర్డులు, వాల్ పెయింట్‌లు అనుమతించ బడతాయన్నారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున ఎవరైనా ఏమైనా గ్లో-బోర్డులు, సైన్ బోర్డులు ఏర్పాటు చేసుకోనదలచిన వారు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్‌ల నుంచి రాతపూర్వకంగా అనుమతి పొందాలన్నారు. అనుమతులకు దరఖాస్తులు చేసిన వారికి ఎన్నికల నిబంధనలకు లోబడి అనుమతి ఇవ్వడం జరుగుతుందని అన్నారు.

వైసీపీ బూత్ కన్వీనర్ టీడీపీలో చేరిక

విశాలాంధ్ర-పెదకాకాని : మండలంలోని పెదకాకాని గ్రామం ముస్లీం పాలెం సచివాలయం-5కు చెందిన వైసీపీ బూత్ కన్వీనర్ షేక్ అలీ మోర్తాజా బుధవారం చింతలపూడి గ్రామంలో పొన్నూరు నియోజ కవర్గ తెలుగుదేశం, జనసేన, బీజేపీల ఉమ్మడి అభ్యర్థి ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. అలీ మోర్తాజా మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ గెలుపుకు శక్తివంచన లేకుండా పనిచేసి భారీ మెజార్టీతో గెలిచే విధంగా తమ వంతు సహకారాన్ని అందిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వలివేటి మురళీకృష్ణ, పెండ్యాల నాగసురేష్ తదితరులు పాల్గొన్నారు.

రాక్షస పాలన మళ్లీ రాకూడదు

విశాలాంధ్ర-గుంటూరు : జగన్ రాక్షస పాలన మళ్లీ రాకూడదన్న దృఢ నిశ్చయంతో ప్రజలున్నారని తెలుగుదేశం పార్టీ గుంటూరు నగర అధక్షులు డేగల ప్రభాకర్ అన్నారు. అర్బన్ పార్టీ కార్యాలయంలో బుధ వారం విలేకర్లతో ప్రభాకర్ మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజలు వైసీపీ ప్రభుత్వం పట్ల అసంతృప్తితో ఉన్నారని, టీడీపీ, జనసేన, బీజేపీ కూట మి అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న వైసీపీని ప్రజలు తరిమికొట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎన్నికల సంఘం వైసీపీకి ఫ్యాన్ గుర్తును రద్దు చేసి, గొడ్డలి గుర్తు కేటాయించాలన్నారు. 5 ఏళ్లలో 600 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు హత్యకు గురయ్యారని తెలి పారు. సొంత బాబాయిని గొడ్డలితో చంపిన వారి నాయకుల్ని వైసీపీ కార్యకర్తలు ఆదర్శంగా తీసుకున్నారన్నారు. ఇటువంటి నియంత పాలనకు చరమగీతం పాడేందుకు ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు.

శివయ్యను పరామర్శించిన సీపీఐ నాయకులు

విశాలాంధ్ర-దుగ్గిరాల : మండల పరిధిలోని మంచికలపూడి గ్రామంలో నియోజకవర్గ వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి యార్లగడ్డ శివయ్యకు కంటి శుక్లాం తీసినందున బుధవారం పరామర్శించారు. పరామర్శించిన వారిలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావు, మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, మంగళగిరి మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు తదితరులు పాల్గొని శివయ్య పరామర్శించారు.

అన్ని వర్గాలకు గుర్తింపు ఇచ్చిన సీఎం జగన్

- గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : సామాజికంగా, రాజకీయంగా అన్ని వర్గాల వారికి గుర్తింపు ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని గుంటూరు పార్లమెంట్ వైసీపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య అన్నారు. గుంటూరు పార్లమెంట్ అభ్యర్థిగా తనను నియమించిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. బృందావన్ గార్డెన్స్‌లోని తన నివాస మందు గుంటూరు పార్లమెంట్ పరిధిలోని 7 నియోజకవర్గాల అభ్యర్థులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని సామాజికవర్గాలను సమానంగా చూసిన ముఖ్యమంత్రి ఎవరైనా ఉన్నారంటే అది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ సంక్షేమ పథకాలతోనే సమాజంలోని పేదరికాన్ని తొలగించవచ్చన్నారు. ఈ నేపథ్యంలోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విరివిగా సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరువ చేశారని స్పష్టంచేశారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ 175కి 175 సీట్లు, అలాగే 25 ఎంపీ సీట్లకు 25 ఎంపీ సీట్లు గెలుచుకుంటామన్న ధీమాను వ్యక్తంచేశారు. ఆంధ్ర రాష్ట్రంలో వైసీపీ ఎంతో బలమైందని, వైసీపీని ఢీ కొట్టాలన్న ఉద్దేశ్యంతో చంద్రబాబు నాయుడు పిచ్చిపిచ్చి వ్యూహాలు రచిస్తుంటారని ఎద్దేవా చేశారు. అనంతరం తూర్పు వైసీపీ అభ్యర్థి నూరి ఫాతిమా మాట్లా డుతూ సామాజిక న్యాయం అంటూ పదేపదే చెప్తున్న కూటమి ఉమ్మడి గుంటూరు జిల్లాలో కాపులకు ఒక్క సీటు కూడా ఇవ్వలేదన్నారు. సామాజిక న్యాయం దిశగా ఈ రాష్ట్రంలో పాలన కొనసాగు తుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే అభ్యర్థులు అంబటి మురళీకృష్ణ, అన్నా బత్తుని శివప్రసాద్, వైసీపీ నాయకులు మేడా హనుమంతరావు, అంగడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పిడుగురాళ్ల మాధవి గెలుపుకు కృషి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి పిడుగురాళ్ల మాధవి గెలుపుకు తెలుగుయువత విభాగం సైనికుల మాదిరిగా నిర్విరామ కృషి చేసి చారిత్రక విజయాన్ని అందిస్తాం అని గుంటూరు జిల్లా తెలుగుయువత అధ్యక్షులు రావిపాటి సాయి కృష్ణ తెలిపారు. గుంటూరు పశ్చిమ ఎన్నికల కార్యాలయం జీటీ రోడ్డు నందు ప్రారంభోత్సవం సందర్భంగా సాయి కృష్ణ మర్యాదపూర్వకంగా కలిసి మాధవి విజయాన్ని కాంక్షిస్తూ సైకిల్ గుర్తుతో కూడిన జ్ఞాపికను అందజేశారు. ఎన్నికల్లో గుంటురు పశ్చిమ అభ్యర్థి విజయంతో పాటు టీడీపీ నాయకులు పెమ్మసాని, ఏడుగురు అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని సాయి కృష్ణ తెలిపారు. కార్యక్రమంలో తెలుగుయువత నాయకులు షేక్ ఫిరోజ్, మన్నెం శ్రీనివాసరావు, పూసల శ్రీనివాస్, షేక్ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

విడదల రజినీ వ్యవహారంపై ఎన్నికల కమిషన్ స్పందించాలి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: రాష్ట్ర మంత్రి విడదల రజిని సీటు కోసం డబ్బులు తీసుకుం దంటూ సొంత పార్టీ నేత ఆరోపించడం బోగస్ ఓట్లు చేర్పించడానికి ప్రయత్నించి అబాసు పాలు కావటం, పాస్టర్లకు కానుకలు పంపిణీ చేయడం వంటి వివాదాస్పద విడదల వ్యవహార శైలిపై తక్షణం ఎన్నికల కమిషన్ చర్యలు చేపట్టాలని ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు, సీనియర్ టీడీపీ బీసీ నాయకులు డాక్టర్ నిమ్మల శేషయ్య డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక గుజ్జనగుండ్లలోని ఆయన కార్యాలయంలో మీడియాతో మాట్లా దారు. విడదల రజిని ఎన్ని కుయుక్తులు పన్నినా పశ్చిమ నియోజకవర్గంలో ఘోర ఓటమి పాలవడం తథ్యం అన్నారు. చిలకలూరిపేటలో మంత్రి దందాలను చూసి పశ్చిమ వాసులు విడుదల రజనీకి ఓటుతో బుద్ధి చెప్పడం తథ్యమన్నారు.

ఓటమి భయంతోనే టీడీపీ, జనసేన నేతలపై దాడులు

పత్తిపాడు నియోజకవర్గంలో ఓటమి భయంతోనే వైసీపీ అభ్యర్థి తన అనుచరులతో టీడీపీ అభ్యర్థి బూర్ల రామాంజనేయులు పై దాడులకు ప్రోత్సహిస్తున్నారని, అలాగే తెనాలి నియోజకవర్గం కొల్లిపర మండలం వల్లభాపురం గ్రామ జనసేన నేతపై వైసీపీ శ్రేణులు దాడి చేయడం దారుణమని నిమ్మల శేషయ్య ఆరోపించారు.

మంగళగిరిలో చేనేతకు పూర్వవైభవం తీసుకొస్తా!

- చేనేత సొసైటీల ప్రతినిధులతో లోకేష్

విశాలాంధ్ర-తాడేపల్లి : మంగళగిరి నియోజకవర్గంలో చేనేతకు పూర్వవైభవం తీసుకు వస్తానని టీడీపీ మంగళగిరి అభ్యర్థి నారా లోకేష్ పేర్కొన్నారు. ఉండవల్లి లోని నివాసంలో చేనేత సొసైటీల ప్రతినిధులతో యువనేత సమావేశమ య్యారు. లోకేష్ మాట్లాడుతూ మంగళగిరి అంటేనే చేనేతకు ప్రసిద్ధి. ఒడిదుడుకుల్లో ఉన్న చేనేత రంగానికి చేయూతనిస్తాం. ఇప్పటికే మంగళగిరిలో వీవర్స్ శాల ఏర్పాటు చేసి ఉపాధి కల్పించడం జరిగింది. టాటా తనేరియాతో ఒప్పందం కుదుర్చుకుని సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించాం. అధికారంలోకి వచ్చాక చేనేతకు సబ్సిడీలు ఇచ్చి ప్రోత్సహిస్తామన్నారు. అభివృద్ధిలో వ్యాపారులదీ కీలకపాత్రే రాష్ట్రాభివృద్ధి, ఉద్యోగాల కల్పనలో వ్యాపారులు, రిటైల్ వ్యాపారులదీ కీలకపాత్రే. మన ప్రభుత్వం వచ్చాక మీరు అడిగినవి చేస్తాను. కానీ ఉద్యోగావకాశాలు కల్పించాలి. కాస్ట్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాన్ని తీసుకు వస్తామని యువనేత లోకేష్ పేర్కొన్నారు. మంగళగిరి ప్రజలకు శక్తివంచన లేకుండా సేవ చేస్తానన్నారు.

రోటరీ సామాజిక సేవ ప్రశంసీయం:

సామాజిక సేవలో రోటరీ క్లబ్ సంస్థ సేవలు ప్రశంసనీయమని యువనేత నారా లోకేష్ కొని యాడారు. ఉండవల్లి నివాసంలో మంగళగిరి, తాడేపల్లి రోటరీ క్లబ్ ప్రతినిధులతో పాటు రెడ్‌క్రాస్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సమావేశాల్లో గుంటూరు పార్లమెంట్ నాయకులు పెమ్మసాని చంద్రశేఖర్, మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య, చిరు వ్యాపారులు పాల్గొన్నారు.

కుటిల రాజకీయ వ్యూహంతోనే బలసాని కార్యాలయంపై దాడి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ ప్రజలలో అలజడులు సృష్టించి వాటిని అధికార పక్షంపైకి నెట్టి ఎన్నికల కమిషన్‌కు తప్పుడు ఫిర్యాదులు ఇవ్వాలని వ్యూహంలో భాగంగానే ఏకంగా వైసీపీ క్యాంపు కార్యాలయంపై దాడికి పాల్పడ్డారని ప్రత్తిపాడు నియోజకవర్గ వైసీపీ పరిశీలకులు మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి బుధవారం ఆరోపించారు. ముట్టడిలో ప్రత్యక్షంగా పాల్గొన్న టీడీపీ అభ్యర్థి రామాంజనేయులుపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని, దాడికి పాల్పడినందున ఎన్నికల కమిషన్ ఈ దుశ్చర్యను తీవ్రంగా పరిగణించి అతనిని ఎన్నికలలో పోటీ చేయటానికి అనర్హుడుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేది ఓటు

విశాలాంధ్ర-తెనాలి : తెనాలి మున్సిపల్, పోలీసుల ఆధ్వర్యంలో ఎస్‌విఈఈఈపి (సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రాల్ పార్టిసిపేషన్) అవగాహన కార్యక్రమం జరిగింది. మున్సిపల్ ఆఫీసు నుండి శివాజీచౌక్ వరకు ర్యాలీ నిర్వహించి ప్రజలకు ఓటు హక్కు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. మున్సిపల్ కమీషనర్ బి.శేషన్న మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి ఓటే పునాది అని, ఓటు అనే రెండు అక్షరాల పదం దేశ భవిష్యత్తును మార్చేస్తుందన్నారు. 18 సంవత్సరాలు నిండిన పౌరుల ందరికి భారత రాజ్యాంగం ఓటు హక్కు కల్పించిందని చెప్పారు. కాబట్టి అర్హులందరు ఓటు హక్కును ఉపయోగించుకో వాలని తెలిపారు. సీఐ దశరథ రామయ్య మాట్లాడుతూ ప్రజాస్వామ్యం పై విశ్వాసంతో మనదేశ, ప్రజాస్వామ్య సాంప్రదా యాలను, మతం, జాతి, కులం, వర్గం, భాష తారత మ్యాలు లేకుండా ఎటువంటి ఒత్తిడిలకు ప్రభావితం కాకుండా ప్రతి ఎన్నికలలో నిర్భయంగా ఓటు వేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు, మెప్మా ఆర్‌పీలు, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది,ప్రజలు పాల్గొన్నారు.

రామాంజనేయులుపై దాడి పిరికిపంద చర్య

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ప్రత్తిపాడు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి బూర్ల రామాంజనే యులు పై వైసీపీ నేతలు చేసిన దాడి ఒక పిరికిపంద చర్య అని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ కోవెలమూడి రవీంద్ర (నానీ) పేర్కొన్నారు. బుధవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో దాడులు ఏ మాత్రం సహేతుకం కాదని ఆయన హితవు పలికారు. ఎన్నికలకు వాలంటీర్లను దూరంగా ఉంచాలని ఎన్నికల కమిషన్ సూచించిన కూడా వాలంటీర్లను వైసీపీ ప్రచారాలకు ఉపయోగిస్తున్నారని, వారిని ప్రలోభపెట్టే విధంగా సమావేశం ఏర్పాటు చేశారన్న సమాచారంతోనే రామాంజనేయులు అక్కడికి వెళ్ళటం జరిగి ందని, తమ కుట్ర ఎక్కడ బయట పడుతోందన్న భయంతోనే రామాంజనే యులు పై దాడి చేశారని ఇది ఏ మాత్రం మంచిది కాదని కోవెలమూడి రవీంద్ర హితవు పలికారు.

జగనన్న పాలనలో సర్వమత సమానత్వం

- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని

విశాలాంధ్ర-గుంటూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనలో అన్ని మతాలకు సమాన ఆదరణ లభిస్తోందని, రాజ్యాంగం నిర్దేశించిన విధంగా సర్వమత సమానత్వం పరిఢవిల్లుతోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, వైసీపీ గుంటూరు వెస్ట్ నియోజకవర్గ అభ్యర్థి విడదల రజిని తెలిపారు. నగరంలోని 20వ డివిజన్ సంపత్‌నగర్, రామచంద్రాపురం కాలనీలో రామాలయ నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న రజిని మాట్లాడుతూ జగనన్న పాలనలో హిందూ మతంలో అర్చకులకు, క్రైస్తవ మతంలో పాస్టర్లకు, ఇస్లాం మతంలో మౌజమ్‌లకు గౌరవ వేతనం ఇస్తున్నారని తెలిపారు. విజయవాడ దుర్గ గుడిలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నారని, చంద్రబాబు హయాంలో కూల్చివేసిన అనేక ఆలయాలను పునర్నిర్మాణం చేశారని చెప్పారు.

నగరంలో చేసిన అభివృద్ధి ప్రతిపక్షాలకు కనపడదం లేదా?

నగరంలో సంపత్ నగర్, ఆర్.అగ్రహారంలో పలు ప్రధాన రహదారులను విస్తరించి, అత్యంత నాణ్యతతో నిర్మాణం చేశామని, వీటితో పాటు పశ్చిమ నియోజక వర్గంలో బ్రాడీపేట, కోబాల్డ్‌పేట, పట్టాభిపురం తదితర ప్రాంతాల్లో పలు ప్రధాన రహదారులను నిర్మాణం చేశామన్నారు. ప్రతిపక్షాలు అభివృద్ధి లేదంటూ దుష్ప్రచారం చేస్తున్నాయని, కాని తమ హయాంలో చేసిన అభివృద్ధి కళ్లుండీ చూడలేని ప్రతిపక్షాలకు కనపడకపోయినా, నగర ప్రజలకు కళ్లెదుట కనపడుతోందన్నారు. గుంటూరు పశ్చిమ నియోజక వర్గ ప్రజలు చైతన్యవంతులని, రాబోయే ఎన్నికల్లో విజ్ఞతతో వ్యవహరిస్తారని ఆశిస్తున్నానని చెప్పారు. తనకు అవకాశం కల్పిస్తే గుంటూరు పశ్చిమ నియోజకవర్గాన్ని కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి చేసి చూపిస్తానని అన్నారు. తనను ఆశీర్వదించవలసిందిగా విజ్ఞప్తిచేశారు. వైసీపీ నాయకుడు కావటి ఉదయచంద్ర విక్రమ్ నాయుడు, 20వ డివిజన్ వైసీపీ అధ్యక్షుడు కంతేటి శ్యామ్ శేఖర్, ఆలయ కమిటీ ప్రతినిధులు బాలకృష్ణ, వీరయ్య, అప్పారావు, జనార్దన్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న వాలంటీర్లు తొలగింపు : కలెక్టర్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘించి రాజకీయ పార్టీల ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న వాలంటీర్లపై ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చర్యలు తీసుకొని తొలగించటం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్ లోని వీసీ సమావేశ మందిరంలో కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి , కమీషనర్ కీర్తి చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి పెద్ది రోజాతో కలసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చిన ప్పటి నుంచి ప్రభుత్వ, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులతో పాటు గౌరవ వేతనాలు తీసుకుంటున్న వాలంటీర్లు ఎన్నికల ప్రచారాల్లో పాల్గొనరాదని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటున్నామ న్నారు. పొన్నూరు నియోజకవర్గంలో చేబ్రోలు, పెదకా కాని మండలాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వాలంటీర్లను తొలగించేందుకు చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించిన వాలంటీర్లపై గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీడీవోలు, పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్లు చర్యలు తీసుకునేలా రిటర్నింగ్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయటం జరిగిందన్నారు. రాజకీయ పార్టీలు బహిరంగ ప్రదేశాలు, ప్రైవేటు స్థలాల్లో జెండాలు, పోస్టర్లు ప్రదర్శనకు నిబంధనల మేరకు అనుమతులు తీసుకో వాలన్నారు. కరపత్రాలు, ఆడియో, వీడియో సందేశాలకు సంబంధించి ముంద స్తుగా ఎంసీఎంసీ కమిటీ నుంచి అనుమతి తీసుకోవాలన్నారు. ఎన్నికల ప్రచారానికి, ఇతర వస్తువులకు ప్రభుత్వం నిర్దేశించిన ధరల వివరాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందించారు. సమావేశంలో రిటర్నింగ్ అధికారులైన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

FEDBANK FINANCIAL SERVICES LIMITED

ఫెడ్‌బ్యాంక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్

కార్పొరేట్ ఆఫీస్: కనాకియా వాల్‌స్ట్రీట్, ఎ-వింగ్, 5వ అంతస్తు, యూనిట్ నం.501, 502, 511, 512, అంధేరి-కుర్లా రోడ్, చాకాల, అంధేరి ఈస్ట్, ముంబై, మహారాష్ట్ర-400093

స్వాధీనత ప్రకటన

ఫెడ్‌బ్యాంక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ అధీకృత అధికారియైన దిగువ సంతకందారు సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 (54 ఆఫ్ 2022) మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002, నిబంధన 3తో చదివే సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించి రుణగ్రహీత/తనఖాదారు/ సహ-రుణగ్రహీతలైన రుణగ్రహీత, తనఖాదారు, సహ-రుణగ్రహీత(లు):- (1) ఎం/ఎస్. ఖాదర్ డెయిరీ ఫామ్ దాని యజమానిగా ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రీ షేక్ ఖాదర్ మస్తాన్ (రుణగ్రహీత) (2) శ్రీ షేక్ ఖాదర్ మస్తాన్ తండ్రి షేక్ చిన మస్తాన్ (సహ-రుణగ్రహీత) (3) శ్రీ మతి షేక్ సైదాబీ తండ్రి షేక్ సన్నే సాహెబ్ (సహ-రుణగ్రహీత) (4) శ్రీ షేక్ గోపి తండ్రి ఖాదర్ మస్తాన్ షేక్ (సహ-రుణగ్రహీత) లకు నోటీసులో ప్రస్తావించిన మొత్తం బకాయి ఒప్పంద వడ్డీ రేటు ప్రకారం భవిష్యత్తు వడ్డీ ప్లస్ దానిపై అన్ని వ్యయాలు మరియు యాదృశ్చిక ఖర్చుల వగైరాలతో కలిసి తేదీ: 16.01.2024 నాటికి రూ.24,18,376/- (ఇరవై నాలుగు లక్షల పద్దెనిమిది వేల మూడు వందల డెబ్బై ఆరు రూపాయలు మాత్రమే) లను నోటీసు తేదీ నుండి 60 రోజుల్లో తిరిగి చెల్లించవలసిందిగా విజ్ఞప్తి చేస్తూ తేదీ : జనవరి 16, 2024 న డిమాండ్ నోటీసు జారీ చేయడమైనది. మరియు తేదీ: జనవరి 18, 2024న వార్తాపత్రికలో ప్రచురించడమైనది.

రుణగ్రహీత/తనఖాదారు/సహ-రుణగ్రహీతలు బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున దిగువ సంతకందారు నిబంధనల్లో తెలిపిన నిబంధన 8తో చదివే చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించి ఈ కింద వివరించిన ఆస్తిని ఆగస్టు 29, 2023 న లాంఛనప్రాయంగా స్వాధీనపర్చుకొనడమైందని ప్రత్యేకించి రుణగ్రహీత/తనఖాదారు/సహ-రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది. ఈ ఆస్తితో ఎటువంటి లావాదేవీలు నిర్వహించరాదని మరియు ఈ ఆస్తితో ఏదేని లావాదేవీలు, ఒప్పంద వడ్డీ రేటు ప్రకారం భవిష్యత్తు వడ్డీ ప్లస్ దానిపై అన్ని వ్యయాలు మరియు యాదృశ్చిక ఖర్చుల వగైరాలతో కలిసి 16.01.2024 నాటికి రూ.24,18,376/- (ఇరవై నాలుగు లక్షల పద్దెనిమిది వేల మూడు వందల డెబ్బై ఆరు రూపాయలు మాత్రమే) ల కొరకు ఫెడ్‌బ్యాంక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ చార్జికి లోబడి వుంటుందని ప్రత్యేకించి రుణగ్రహీత/తనఖాదారు/హామీదారు మరియు సాధారణప్రజలను హెచ్చరించడమైనది.

హామీగా పెట్టిన ఆస్తులను తిరిగి పొందడానికి అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13, సబ్ సెక్షన్ (8) యొక్క నిబంధనలను గమనించవలసిందిగా రుణగ్రహీతలను కోరడమైనది.

షెడ్యూల్-ఎ-ఆస్తి వివరాలు
(ఎఫ్‌ఎఫ్‌ఎస్‌ఎల్‌కు తనఖా పెట్టిన స్థిరఆస్తి యొక్క వివరాలు)

గుంటూరు జిల్లా, నల్లపాడు సబ్ జిల్లా, చిన్నపలకలూరు శివారు, మల్లవరం గ్రామ పంచాయతీ ఏరియా, చిన్నపలకలూరు డి.నం. 235/బి, ఎసి2-80 సెంట్ల విస్తీర్ణంలో గ్రౌండ్ మరియు మొదటి అంతస్తు ఆర్‌సిసి భవనంతో 113 చదరపు గజాల ఆస్తి. హద్దులు: తూర్పు: బజార్ దక్షిణం: బత్తుల కోటిరెడ్డి ఆస్తి పడమర: ఉడుముల రాజారెడ్డి ఆస్తి, ఉత్తరం: సోదారపు సూరి ఆస్తి. ఈ సరిహద్దుల పరిధిలో ఎస్.సి.నం. 00524,00525 ఆర్‌సిసి డాబా ఇంటితోపాటు 113 చదరపు గజాలు విస్తీర్ణపు స్థలం.

శ్రీ షేక్ ఖాదర్ మస్తాన్ సొంత ఆస్తి

సం/-
(అధీకృత అధికారి)
ఫెడ్‌బ్యాంక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్

ప్రదేశము : గుంటూరు జిల్లా
తేదీ : 19/03/ 2024

విశాలాంధ్ర గుంటూరు జిల్లా

పోలింగ్ కేంద్రాలను సందర్శించిన జేసీ రాజకుమారి

విశాలాంధ్ర-మంగళగిరి : గుంటూరు జిల్లా సంయుక్త కలెక్టర్ రాజకుమారి గణియా మంగళగిరి అసెంబ్లీ నియో జకవర్గానికి రిటర్నింగ్ అధికారి హోదాలో తాడేపల్లిలోని సెక్టారు-4లో 10 పోలింగ్ కేంద్రాలు, మంగళగిరి లోని సెక్టారు-16లో 16 పోలింగ్ కేంద్రాలు, సెక్టారు-20లో 9 పోలింగ్ కేంద్రాలు కలిపి మొత్తం 35 పోలింగ్ కేంద్రాలను సందర్శించి సదరు పోలింగ్ కేంద్రాలలోని మౌలిక సదుపాయాలు, ఎలక్ట్రిక్ కనెక్షన్లు, ఫ్యానులు, లైట్లు పనిచేయుచున్నవో లేదో అని పర్యవేక్షించారు. తదుపరి పోలింగ్ కేంద్రంలోకి ఫర్నీచర్, మంచినీటి వసతి, టాయిలెట్లలో మంచినీటి సౌకర్యం, గ్రౌండ్ లెవెలింగ్, క్యూలైన్ల ఏర్పాట్లను గూర్చి సెక్టారు అధికారులకు సూచనలు ఇచ్చారు. అలానే ఎన్నికల ప్రవర్తన నియమావళి ఆచరణ తీరును పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత మండల తహశీల్దార్లు, సెక్టారు అధికారులు హాజరయ్యారు.

వాణిజ్య స్థలాల్లో అనుమతి లేకుండా బ్యానర్లు ఏర్పాటు చేసే సంస్థలు, వ్యక్తులపై కేసులు : కమిషనర్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు జిల్లాలో ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థల ప్రాంగణాల్లోని వాణిజ్య స్థలాల్లో ఎటువంటి రాజకీయ ప్రకట నలు, హోర్డింగులు, పోస్టర్లను, బ్యాన ర్లను అనుమతించబోమని, అనుమతి లేకుండా ఏర్పాటు చేసే సంస్థలు, వ్యక్తులపై పోలీసు కేసులు నమోదు చేయాలని మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) అధికారులకు నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ (ఆర్ఓ) కీర్తి చేకూరి స్పష్టం చేశారు. బుధవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలుపై మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసిసి), స్టాటిస్టిక్స్ సర్వైలెన్స్ టీం, వీడియోగ్రాఫ్ వ్యూయింగ్ టీం, అకౌంట్స్ ఎక్స్పెండి చర్ టీంలతో ప్రత్యేక సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థల ప్రాంగణాల్లో రాజకీయ ప్రకటనల ఏర్పాటుకు అవకాశం లేదని, నిబంధనలు మీరితే వారి పై పోలీసు కేసులు నమోదుకు చర్యలు తీసుకోవాలని ఎంసీసీ టీంకి స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ కమర్షియల్ ప్రకటనల స్థలాలు, ప్రైవేట్ ప్రకటనల స్థలాల్లో ఉన్న బోర్డ్లను అన్ని రాజకీయ పార్టీలకు సమాన ప్రాతిదికన ఇవ్వా లన్న ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సీటీ ప్లానర్‌ని ఆదేశించారు. సమావేశంలో ఏఆర్‌ఓలు, వివిధ టీంల అధికారులు పాల్గొన్నారు.

గల్లా జయదేవ్ ఎన్నిక చెల్లదన్న మోదుగుల పిటిషన్‌ను కొట్టివేసిన హైకోర్టు

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: 2019లో గుంటూరు పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు సమయంలో అక్రమాలు జరిగాయని, రీ కౌంటింగ్ సరిగా చేయలేదంటూ 2019 ఎన్నికల్లో గుంటూరు పార్లమెంట్ వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై ఐదేళ్ల నుంచి హైకోర్టులో విచారణ సాగింది. మోదుగుల దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసిందని గుంటూరులోని ఎంపీ గల్లా జయదేవ్ కార్యాలయ ప్రతినిధి బుధవారం తెలియజేశారు.

ఏ విధమైన సైడ్ ఎఫెక్ట్స్ లేని శారీరక వైద్యమే 'ఫిజియోథెరపీ'

- ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ సుజాత

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఫిజియోథెరపీ ఒక శారీరక చికిత్స అని, ఏ విధమైన సైడ్ ఎఫెక్ట్స్ లేని శారీరక వైద్యమైన 'ఫిజియోథెరపీ'పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఫిజియో థెరపిస్ట్ డాక్టర్ వి.సుజాత తెలిపారు. స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో 'ఫిజియోథెరపీ'పై అవగాహన సభ జరిగింది. డాక్టర్ సుజాత మాట్లాడుతూ కారణాలు ఏవైనా మానసికంగా.. శారీరకంగా కృంగిపోయే రోగుల వికాసానికి సంజీవిని వలే స్వాంతన చేకూర్చేది ఫిజియోథెరపీ అని అన్నారు. మారుతున్న శాస్త్ర పరిజ్ఞానంతో సైన్సు నిత్యం అనేక కొత్త పోకడలతో అసాధ్యాన్ని సుసాధ్యం చేసే క్రమంలో ఫిజియోథెరపీ వైద్యశాస్త్రంలో ఉప విభాగంగా ఆవిర్భవించిందని అన్నారు. ఏదైనా అనారోగ్యం లేదా గాయం తరువాత శరీరం తిరిగి మామూలుగా అయి రోగి తన విధులను సక్రమంగా చేసుకునేలా చేయగలిగేది ఫిజియోథెరపీ అని పేర్కొన్నారు. రోగుల జీవన విధానం మెరుగుపర్చటంలో ఫిజియోథెరపీ ముఖ్య పాత్ర వహిస్తోందని, ఫిజియోథెరపీ రోగిలో మునుపటి ఉత్సాహంతో పాటు స్వీయ విశ్వాసాన్ని అందిస్తుందన్నారు. నాడీ వ్యవస్థ లోపాలు, కండరాల లోపాలు, శ్వాసకోశ రుగ్మతలకు ఫిజియోథెరపీ బాగా ఉపయోగపడుతుందని డాక్టర్ సుజాత తెలి పారు. పక్షవాతం, మెడనొప్పి, నడుమునొప్పి, మోకాళ్ళ నొప్పి, భుజం నొప్పి, వెన్ను సమస్యలు ఉన్న వారు తక్షణమే ఫిజియోథెరస్ట్‌లను సంప్రదించాలని సూచించారు. ఈ సభలో కొండా శివరామిరెడ్డి, సదాశివం, అంజి తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, VENKATA ROOPA DEVI BEZAWADA (Old Name), W/o. PUVVULA CHIRANJEEVI ANIL, Resident of Door No.133-5-639, Vishnu Nagar 4th Line, Opp: ID Hospital, Nagaralu, Gorantla, Guntur, Guntur District - 522034, Andhra Pradesh. I have changed my name as **PUVVULA VENKATA ROOPA DEVI** (New Name) W/o. PUVVULA CHIRANJEEVI ANIL, Hereafter my name is known as **PUVVULA VENKATA ROOPA DEVI** (New Name) W/o. PUVVULA CHIRANJEEVI ANIL.

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

ఈ నెల 31న రాష్ట్ర స్థాయి బ్రాహ్మణ సమ్మేళనం

- జయప్రదం చేయాలని బందా, ఆచారి పిలుపు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తమకు చేసిన మేలు, తద్వారా తాము పొందిన ప్రయోజనాన్ని నిజమైన బ్రాహ్మణులెవరూ ఎన్నటికీ మరువరని గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ(ఆచారి) స్పష్టం చేశారు. జగన్‌కు బాహాటంగా మద్దతు ప్రకటించి ఆయనను మళ్ళీ ముఖ్యమంత్రిగా చేసుకునేలా కృషి చేయడం ద్వారా ఈ వాస్తవాన్ని లోకానికి చాటి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని వారు అభిప్రాయపడ్డారు. ఈ నెల 31వ తేదీన విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర స్థాయి బ్రాహ్మణుల సమావేశం జరుగనున్న నేపథ్యంలో బుధవారం గుంటూరులో బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు భేటీ అయ్యారు. సదరు సమావేశానికి పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సందర్భంగా బందా రవీంద్రనాథ్ మాట్లాడుతూ గత పాలకులెవరూ చేయని విధంగా ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాలలో తమ జాతికి సీఎం జగన్ తగిన ప్రాధాన్యత కల్పించినట్లు వెల్లడించారు. జగన్ ముఖ్యమంత్రిగా పాలనా పగ్గాలు చేపట్టిన నాటి నుంచి బ్రాహ్మణుల సంక్షేమంపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు చెప్పారు. ఈచంపాటి వెంకటకృష్ణ మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆలయ, అర్చక వ్యవస్థల మేలు కోసం కృషి చేస్తే దానికి కొనసాగింపుగా జగన్ వారికి రాజకీయ ప్రాతినిధ్యం కల్పించి బ్రాహ్మణ జాతి అభివృద్ధికి విశేషంగా పాటుపడ్డారని తెలిపారు. సమావేశంలో నంది రాజు మీనాక్షి, కప్పగంతుల ఆదిలక్ష్మి, నిమ్మరాజు శారదాలక్ష్మి, పలివేటి వెంకట రమణ, కంతేటి శ్యామ్, రావినూతల హరిప్రసాద్, రాళ్ళబండి చందు, బడేకర్ నాగరాజు, మన్నేపల్లి హనుమంతరావు, యల్లాప్రగడ సుధ పాల్గొన్నారు.

చంద్రబాబును ప్రజలు నమ్మరు

విశాలాంధ్ర-గుంటూరు : రాష్ట్ర ప్రజలు చంద్రబాబు నాయుడును శాశ్వతంగా నమ్మే పరిస్థితులే లేవని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, వైసీపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి విడదల రజిని తెలిపారు. గుంటూరు లాడ్జిసెంటర్, బ్రహ్మం గారి వీధిలో ఉన్న శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆలయాన్ని బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ ఛైర్మన్ ఉమ్మడోజు నాగేశ్వరాచారి, కల్యాణ మండప నిర్మాణ కమిటీ సభ్యులు ఆమెకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దైవదర్శనానంతరం బయటకు వచ్చాక ఆమె మీడియాతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేని నాయకుడిగా, చరిత్రలో చీకటి అక్షరాలతో చంద్రబాబునాయుడు మిగిలిపోతాడని దుయ్యబట్టారు. ఎన్నికలు వస్తే చాలు అలవిగాని హామీలు ఇవ్వడం చంద్రబాబునాయుడుకి అలవాటు అని, అధికారంలోకి వస్తే ఆ హామీలన్నింటినీ తుంగలో తొక్కడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య అని ధ్వజమెత్తారు. ప్రజలకు ఆయన గురించి బాగా తెలుసని, మరోసారి ఓట్లు వేసి మోసపోయేందుకు సిద్ధంగా లేరని స్పష్టం చేశారు.

జగనన్న పాలనలోనే బీసీలకు అందలం: తెలుగుదేశం పార్టీ నాలుగు దశాబ్దాలుగా బీసీలను ఓటు బ్యాంకుగానే చూసిందే తప్ప, ఆచరణలో వారికి ఎలాంటి మేలు చేయలేదని దుయ్యబట్టారు. జగనన్న మాత్రం బీసీలను బ్యాక్ బోన్ క్యాస్టులుగా గుర్తించి అందలం ఎక్కించారని పేర్కొన్నారు. చంద్రబాబు హయాంలో బీసీలను చిన్నచూపు చూశారని, ఇప్పుడు ఎన్నికలు రావడంతో మళ్లీ బీసీ జపం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో కల్యాణ మండప నిర్మాణ కమిటీ అధ్యక్షుడు కడియాల సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి తెగుడోజు గురుబ్రహ్మం, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రాజోలు నియోజకవర్గంలో మళ్ళీ జనసేన జెండా ఎగరాలి

విశాలాంధ్ర-మంగళగిరి : రాజోలు నియోజకవర్గంలో జనసేన జెండా మళ్ళీ ఎగురవేయాలని పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆకాంక్షించారు. గత ఎన్నికల్లో జనసేనను గెలిపించిన ఆ నియోజకవర్గం ఓటర్లు నాడు చూపించిన ఆదరణను నేడు మరింత పొందాలని, వారు మన మీద ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటామన్నారు. బుధవారం మధ్యాహ్నం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో పవన్ కళ్యాణ్‌తో రాజోలు నియోజకవర్గ జనసేన నాయకులు, విశ్రాంత ఐఏఎస్ అధికారి దేవ వరప్రసాద్ సమావేశమయ్యారు. నియోజకవర్గ పరిస్థితిపై చర్చించారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో ప్రణాళికాబద్ధంగా అనుసరించాల్సిన విధానాలను పార్టీ అధ్యక్షుల వారు వివరించారు. అనంతరం వరప్రసాద్‌కు ఎన్నికల ప్రక్రియలో భాగమైన ప్రచారం, నామినేషన్ దాఖలకు సంబంధించిన నియమావళి, నిబంధనలతో కూడిన పత్రాలను అందచేశారు.

స్వర్ణకారుల జీవితాలతో రాజకీయాలు చేయొద్దు

విశాలాంధ్ర-మంగళగిరి : స్వర్ణకారుల జీవితాలతో రాజకీయాలు చేయొద్దని గుంటూరు జిల్లా స్వర్ణ కారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పారేపల్లి మహేష్ అన్నారు. మంగళగిరి పట్టణంలోని షరాఫ్ బజారులో బుధవారం విలేఖరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ మేరకు పారేపల్లి మహేష్ మాట్లాడుతూ స్వర్ణకారుల కార్పొరేషన్ కోసం గత ప్రభుత్వ హయాంలో కూడా స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో 14 రోజులపాటు రిలే నిరాహార దీక్షలు చేయడం జరిగిందని పారేపల్లి తెలిపారు. ఆనాడు టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన మీదట దీక్షను విరమించడం జరిగిందని చెప్పారు. ఆ తరువాత రాష్ట్రంలో జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని చెప్పారు. స్వర్ణకారుల కార్పొరేషన్ కోసం జిల్లా స్వర్ణకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాజకీయాలకతీతంగా రిలే నిరాహార దీక్షలు చేయడం జరిగిందని చెప్పారు. జీవో వచ్చినట్లుగా నేను చెప్పలేదని తెలిపారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం వచ్చినా స్వర్ణ కారుల కార్పొరేషన్ వంద రోజుల్లో ఏర్పాటు చేయకపోతే అమరణ నిరాహార దీక్షకు పూనుకుంటానని హెచ్చరించారు.సమావేశంలో స్వర్ణకారుల సంక్షేమ సంఘం నాయకులు జై.వర ప్రసాద్, యు.నరేంద్ర, డి.నారాయణ, కె.ధనుంజయ్‌రావు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

విశాలాంధ్ర-రెంటచింతల : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని మంచికల్లు, తపాల్వాయి గేటు, రెంటాల, రెంటచింతల, మిట్టగుడిపాడు, గోలి, జెట్టిపాలెం, పశర్లపాడు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల ఏర్పాటును మాచర్ల నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్, పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాం ప్రసాద్ మండల అధికారులతో కలిసి బుధవారం పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో 299 పోలింగ్ బూత్‌లకు గాను 240 పోలింగ్ బూత్‌లు సమస్యాత్మకంగా గుర్తించామన్నారు. సత్రశాలలోని టెయిల్ పాండ్ వద్ద నున్న చెక్ పోస్ట్‌ను ఆయన తనిఖీ చేసి సిబ్బందికి తగు సూచనలు చేశారు. వాహనాల తనిఖీ, తనిఖీ సమయంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌కి వ్యతిరేకంగా లభించిన డబ్బులు, సామగ్రి స్వాధీనం చేసుకునే విధానాన్ని గురించి వారికి వివరించి, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సిబ్బందికి సూచించారు. మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాలను విధిగా ఎప్పటికప్పుడు తనిఖీ చేసి సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పరిశీలనలో ఆయన వెంట తహసీల్దార్ రామ్మోహనరావు, ఎంపీడీవో శంకర్రావు, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి పాపయ్య, ఆర్‌ఐ కాంతారావు, ఎస్సై నారాయణరెడ్డి, పలువురు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్టీ వర్గాల అభివృద్ధికి కృషి : మంత్రి అంబటి

విశాలాంధ్ర-సత్తెనపల్లి: ప్రభుత్వం పేదల పక్షపాతి అని, ఆయా వర్గాల సామాజిక, ఆర్థిక, రాజకీయ అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి విశేషంగా కృషి చేస్తున్నారని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు అన్నారు. సత్తెనపల్లి పట్టణ మంత్రి కార్యాలయంలో పెద్ద మక్కేన ఎస్టీ కాలనీ వాసుల అభివృద్ధికి సహకరించిన మంత్రి అంబటికి వారు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి మాట్లాడుతూ మీ అభివృద్ధికి అండగా ఉంటామన్నారు. ఏ సమస్య, ఇబ్బంది వచ్చినా సహకరించేందుకు సిద్ధంగా ఉన్నామని వివరించారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో యానాది కాలనీ వాసుల అభివృద్ధికి సహకరించిన మంత్రిని ఘనంగా సన్మానించారు. రాయపాటి పురుషోత్తమ రావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, వైసీపీ అనుబంధ సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

పట్టణంలో టీడీపీ శంఖారావం కార్యక్రమం

విశాలాంధ్ర-గురజాల: నియోజకవర్గ కేంద్రమైన గురజాల పట్టణంలో బుధవారం టిడిపి నేతలు శంఖారావం-బాబు సూపర్ 6 కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని 8, 9వ వార్డు, పెదబావి, చిన్న మసీదు, రామాలయం సెంటర్ నందు నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, గురజాల నియోజకవర్గ తెలుగుదేశం-జనసేన-బిజెపి పార్టీల ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వార్డులోని ప్రతి ఇంటికి తిరుగుతూ గతంలో టిడిపి హయాంలో జరిగిన అభివృద్ధిని వివరించుకుంటూ రాబోయే ఎన్నికల్లో గెలిచిన తర్వాత నియోజకవర్గంలో చేయబోయే అభివృద్ధితో పాటు బాబు సూపర్ 6 పేరిట ప్రతి ఒక్కరికి అందజేసే సంక్షేమ పథకాలను ఇంటింటికి వివరించుకుంటూ ముందుకు సాగారు.

టీడీపీ పట్టణ అధ్యక్షుడు అడపా శ్రీనివాసరావు, సీనియర్ నాయకుడు పోటు నాగేశ్వరరావు, జనసేన నాయకుడు బడిదెల శ్రీనివాసరావు, తదితర నాయకులు, తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీల కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

డాక్టర్ శ్రీనివాస్‌తో యరపతినేని భేటీ

బాబు సూపర్ 6- శంఖారావం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొనేందుకు పట్టణానికి వచ్చిన యరపతినేని శ్రీనివాసరావు పట్టణంలోని ప్రముఖ వైద్యులు, టిడిపి పార్టీ నాయకుడు డాక్టర్ చల్లగుండ్ల శ్రీనివాసరావును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం-బిజెపి-జనసేన పార్టీల విజయానికి కృషి చేయాలని చల్లగుండ్ల శ్రీనివాసును కోరారు. కచ్చితంగా రాబోయే ఎన్నికల్లో టిడిపి-జనసేన-బిజెపి విజయానికి కృషి చేస్తానని శ్రీనివాస్ తెలిపారు.

టీడీపీ అభ్యర్థి రామాంజనేయులు కారుపై దాడి

విశాలాంధ్ర-ప్రత్తిపాడు : గుంటూరు వికాస్ నగర్‌లో గల వైసీపీ అభ్యర్థి బాలసాని కిరణ్ కుమార్ వలంటీర్లకు తాయిలాలు పంచుతున్నారన్న సమాచారంతో వాస్తవాలు తెలుసుకునేందుకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బి.రామాంజనేయులు పార్టీ కార్యకర్తలతో కలిసి అక్కడికి వెళ్లే ప్రయత్నం చేశారు. వైసీపీ కార్యకర్తలు ఆయన్ను అడ్డుకొని కారును ధ్వంసం చేసినట్లు టీడీపీ కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. వైసీపీ కార్యకర్తలు, నాయకులుపై ఫిర్యాదు చేసేందుకు నల్లపాడు స్టేషన్‌కు తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు భారీగా చేరుకున్నారు. వలంటీర్లతో సమావేశమైన ఫోటోలను ఎన్నికల ప్రధాన అధికారికి పంపించనున్నట్లు తెలుగుదేశం అభ్యర్థి బి.రామాంజనేయులు తెలిపారు.

డాక్టర అరవిందబాబుకే టీడీపీ టికెట్ కేటాయించాలి

- పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్న మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ రామిరెడ్డి

విశాలాంధ్ర-నరసరావుపేట: పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట అసెంబ్లీ తెలుగుదేశం పార్టీ సీటు డాక్టర్ అరవింద్ బాబుకే కేటాయించాలని అధిష్టానాన్ని కోరుతున్నానని మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ పులివిరామిరెడ్డి అన్నారు. పట్టణ పరిధిలోని పాలపాడు గ్రామంలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడుతూ విలేకరుల సమక్షంలోనే అకస్మాత్తుగా పురుగుమందు డబ్బా తీసి తాగాడు. నరసరావుపేట నియోజకవర్గం టిడిపి అసెంబ్లీ ఇంచార్జ్‌గా గత ఐదేళ్లుగా డాక్టర్ అరవింద బాబు కష్టపడి పని చేస్తున్నారని, అభివృద్ధికి ఎంతో కృషి చేశారని అయితే ఇప్పటివరకు టిడిపి అధిష్ఠానం ఆయన పేరును ప్రకటించకపోవడం బాధాకరమని అన్నారు. డాక్టర్ అరవింద బాబు స్థానంలో మరొకరికి టికెట్ ఇప్పించేందుకు ఎంపీ అభ్యర్థి లావు కృష్ణదేవరాయలు ప్రయత్నిస్తున్నారని పులిమి రామిరెడ్డి ఆరోపించారు. డాక్టర్ అరవింద బాబుకు టికెట్ రాకపోతే అందుకు శ్రీకృష్ణదేవరాయలే బాధ్యత వహించాలని అంటూ పురుగు మందు తాగాడు. పార్టీ శ్రేణులు ఆయనను పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేస్తున్నారు.

ఎంహెచ్‌పీఎస్‌లో చేరిన పలువురు ముస్లీం యువకులు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ముస్లింల సంక్షేమం కోసం ముస్లిం హక్కుల పోరాట సమితి (ఎంహెచ్‌పీఎస్) కట్టుబడి ఉందని ఆ సమితి రాష్ట్ర అధ్యక్షులు షేక్. ఖాజావలి అన్నారు. గుంటూరు నగరంలోని శ్రీ నగర్‌కు చెందిన పలువురు ముస్లిం యువకులు ముస్లిం హక్కుల పోరాట సమితిలో చేరారు. దీంతో ఎంహెచ్‌పీఎస్ కండువాలను వారికి కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఖాజావలి మాట్లాడుతూ రానున్న పార్లమెంట్, శాసనసభ ఎన్నికల్లో ముస్లింలకు సముచిత స్థానం కల్పించాలని అన్ని రాజకీయ పార్టీలకు ఆయన విజ్ఞప్తి చేశారు. తెలుగుదేశం పార్టీ కేవలం మూడు స్థానాలను కేటాయించడం సమంజసం కాదని, సామాజిక న్యాయం పాటిస్తామన్న జనసేన ఒక్క స్థానం కూడా ముస్లింలకు ఇవ్వకపోవడంపై జనసేనాని ఏం సమాధానం చెప్తారని ప్రశ్నించారు. ముస్లింలు జనసేనను ఆదరించడం లేదని గతంలో ప్రకటన చేసిన పవన్ కళ్యాణ్ ముస్లింలకు సీటు ఇవ్వకుండ జనసేననే ముస్లింలను నిర్లక్ష్యం చేసిందని ఆయన ఆరోపించారు. ఏడు అసెంబ్లీ స్థానాలు కేటాయించిన వైసీపీ ప్రభుత్వం ఒక్క పార్లమెంట్ స్థానాన్ని కూడా ఇవ్వకపోవడం శోచనీయమని, ఇప్పటికైనా కనీసం ఒక పార్లమెంట్ స్థానా న్నైనా ముస్లింలకు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. జాబితా విడుదల చేయని ఇండియా కూటమి తరఫున కాంగ్రెస్ పార్టీ కనీసం 15 శాసనసభ స్థానాలను, రెండు పార్లమెంట్ స్థానాలను ముస్లింలకు ఇచ్చి మరల కాంగ్రెస్ వైపు ముస్లింలు ఆకర్షితులయ్యేలా కృషి చేయాలని కోరారు. అనంతరం ఎంహెచ్‌పీఎస్ నగర అధ్యక్షుడుగా షేక్ మీరావలిని నియమించారు. కార్యక్రమంలో షేక్ మస్తాన్, షేక్ హుస్సేన్, షేక్ నాగూర్ బాబు, షేక్ సులేమాన్, షేక్ నాగర్‌వలి, షేక్ నిజాముద్దీన్‌లతో పాటు స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

నాగేశ్వరరావు మృతి టీడీపీకి తీరని లోటు

విశాలాంధ్ర-గుంటూరు : టీడీపీ సీనియర్ నాయకులు, నాయీ బ్రాహ్మణ ఫెడరేషన్ మాజీ ఛైర్మన్ గుంటుపల్లి నాగేశ్వరరావు హఠాన్మరణం తెలుగుదేశం పార్టీకి తీరని లోటని టీడీపీ జిల్లా అధ్యక్షులు తెనాలి శ్రావణ్ కుమార్ అన్నారు. గుండెపోటుతో మరణించిన టీడీపీ జాతీయ క్రమశిక్షణ సంఘం సభ్యులు గుంటుపల్లి నాగేశ్వరరావు చిత్రపటానికి జిల్లా బీసీ విభాగం అధ్యక్షులు వేములకొండ శ్రీని వాస్ అధ్యక్షతన జిల్లా పార్టీ కార్యాలయంలో టీడీపీ జిల్లా అధ్యక్షులు తెనాలి శ్రావణ్ కుమార్, ప్రత్తి పాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బూర్ల రామాంజనేయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ నాగేశ్వరరావు పార్టీలో క్రియాశీల కార్యకర్తగా, నాయకుడిగా బడుగు బలహీన వర్గాల గొంతుకను బలంగా వినిపించారన్నారు. వారికి అప్పగించిన ఏ పనినైనా చిత్తశుద్ధితో, క్రమశిక్షణతో పార్టీకి అంకితభావంతో పనిచేసే లక్షణం నాగేశ్వరరావు నుంచి నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో కంచర్ల శివరామయ్య, మల్లె ఈశ్వరరావు, కందుకూరి వెంకట్, బత్రాజు హనుమంతరాజు, బుర్రి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులపై హత్యారాజకీయాలు చేస్తున్న వైసీపీ ప్రభుత్వం

విశాలాంధ్ర-గుంటూరు : గిరిజనులపై వైసీపీ ప్రభుత్వం హత్యారాజకీయాలు చేస్తుందని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.ధారునాయక్ ఒక ప్రకటనలో అన్నారు. ప్రకాశం జిల్లా, గిద్దలూరు నియోజకవర్గం గిద్దలూరు మండలం టీడీపీ కార్యకర్త మునయ్యను వైసీపీ గూండాలు గొడ్డలితో నరికి చంపటం దుర్మార్గమన్నారు. సొంత బాబాయిని గొడ్డలితో చంపిన నాయకుల్ని వైసీపీ కార్యకర్తలు ఆదర్శంగా తీసుకున్నారని అన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటినుంచి గిరిజనులను అనేకమందిని పొట్టనపెట్టుకున్నారని విమర్శించారు. టీడీపీ గిరిజన యానాది సామాజికవర్గ నాయకుడు పాముల మునయ్య హత్యను తీవ్రంగా ఖండించారు. తమ కార్యకర్తలపై దాడులు చేసినవారిని, హత్యలు చేసిన వారిని వదిలే ప్రసక్తే లేదని హెచ్చరించారు. మునయ్యను హత్య చేసిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, నిందితుని వెనుక ఉన్న రాజకీయ నాయకులపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కేఎల్‌యూలో ముగిసిన ఫిలిం ఫెస్టివల్

విశాలాంధ్ర-తాడేపల్లి: కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో లలిత కళల విభాగం సినీఫిలియా సందర్భంగా నిర్వహించిన ఫిలిం ఫెస్టివల్ వేడుకలు బుధవారం ఘనంగా ముగిశాయి. చిత్ర పరిశ్రమ నిపుణులు, చిత్ర నిర్మాతలు, ఔత్సాహికులు పెద్ద సంఖ్యలో పాల్గొని లలిత కళల విభాగం విద్యార్థులకు చిత్ర పరిశ్రమ గురించి అవగాహన కల్పించారు. యూనివర్శిటీ క్యాంపస్‌లోని జాస్మిన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ పరిశ్రమల నుంచి వచ్చిన అతిథులు వేడుకల్లో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వైల్డ్‌లైఫ్ ఫోటోగ్రాఫర్ శ్రీకాంత్ రూపొందించిన ఫోటోబుక్ ను యాడ్ ఫిల్మ్ డైరెక్టర్ బెంజమిన్ గైని, అసిస్టెంట్ సినిమాటోగ్రాఫర్ అభిసంగలు విడుదల చేశారు. వారు తమ నైపుణ్యం, అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. వైల్డ్‌లైఫ్ ఫోటోగ్రఫీ, ఫోటో జర్నలిజం యొక్క ప్రాముఖ్యతపై ప్రఖ్యాత వైల్డ్‌లైఫ్ ఫోటోగ్రాఫర్ శ్రీకాంత్ ప్రసంగించారు. వర్ధమాన చలనచిత్ర నిర్మాతల విభిన్న ప్రతిభను సృజనాత్మకతను ప్రదర్శించే షార్ట్ ఫిల్మ్‌ల ప్రదర్శనలకు హాజరైన వారిని అభినందించారు. అనంతరం సినిమాటోగ్రఫీ మరియు లైటింగ్ టెక్నిక్‌లలోని చిక్కులను పరిశోధించి, ఔత్సాహిక చిత్రనిర్మాతలకు విలువైన సలహాలను అభిసంగ అందించారు. ఈ సందర్భంగా లలితకళల విభాగం రూపొందించిన "పేజెస్ టు పిక్చర్స్" పుస్తకావిష్కరణను విద్యార్థుల ప్రోగ్రెషన్, స్కిల్ డెవలప్‌మెంట్ డీన్ డాక్టర్ శ్రీనాథ్ ఆవిష్కరించారు. ఈ ప్రచురణ దృశ్యమాన కథలు, ఫోటోగ్రఫీ ప్రపంచంలోకి వెళ్లాలని చూస్తున్న వారికి విలువైన వనరుగా ఉంటుందనిన్నారు. బెంజమిన్ గైని అవుట్‌డోర్ ప్రొడక్షన్‌పై సాంకేతిక వర్క్‌షాప్‌కు హాజరైన వారికి చలనచిత్ర నిర్మాణ కళలో ఆచరణాత్మక జ్ఞానం, అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమంలో వర్శిటీ వైస్ చాన్సు లర్ డాక్టర్ జి. పార్థ సారధి వర్మ, ప్రో వైస్ ఛాన్సలర్‌బీ డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఎంహెచ్‌ఎస్ డీన్ డాక్టర్ ఎం. కిషోర్ బాబు, విద్యార్థుల ప్రోగ్రెషన్, స్కిల్ డెవలప్‌మెంట్ డీన్ డాక్టర్ శ్రీనాథ్, ఉదోగ్య కల్పన విభాగం డీన్ డాక్టర్ ఎన్ బివి ప్రసాద్, లలిత కళల విభాగాధిపతి సుభాష్ యలవర్తి పాల్గొన్నారు.

వైసీపీ సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్ ఇంటిపై టీడీపీ శ్రేణుల దాడి

విశాలాంధ్ర-ప్రత్తిపాడు : గుంటూరు నగరంలో గల ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్ ఇంటిపై తెలుగుదేశం పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బూర్ల రామాంజనేయులు తన అనుచరులు టీడీపీ కార్యకర్తలతో ప్రత్తిపాడు నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్ కుమార్ ఇంటి మీద దాడులు చేసినట్లు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఆరోపించారు. రామాంజనేయులు గుండాయిజం నశించాలని వైసీపీ కార్యకర్తలు, నాయకులు నినాదాలు చేశారు. పెనుగులాటలో వైసీపీ కార్యకర్తలకు కొంతమందికి గాయాలయ్యాయి. రామాంజనేయులు తీరుపై సార్వత్రా విమర్శలు వస్తున్నాయని విచక్షణ మరిచి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసి పార్టీ కార్యాలయాలపై దాడికి పాల్పడటంపై వైసీపీ కార్యకర్తలు మండిపడుతున్నారు. వైసీపీ సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్ మాట్లాడుతూ టీడీపీ గూండాలపై ఎస్పీకి ఫిర్యాదు చేస్తామని ఆయన అన్నారు.

బీసీ సెల్ అధ్యక్షునిగా మల్లికార్జునరావు

విశాలాంధ్ర-మాచర్ల: మాచర్ల నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షునిగా పట్టణానికి చెందిన కొర్రపాటి మల్లికార్జున రావు నియమితులయ్యారు. బుధ వారం ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మల్లికార్జున రావుకు నియామకపత్రాన్ని అందజేశారు. మల్లికార్జునరావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో నియోజకవర్గ బాధ్యతలు అప్పగించిన పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, సోదరుడు వెంకట రామిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. బీసీలను ఐక్య పరిచి రానున్న ఎన్నికల్లో వైసీపీ విజయానికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు.

టీడీపీలో పలువురు చేరిక

విశాలాంధ్ర-విజయపురిసౌత్: మాచర్ల మండలంలోని చింతల తండా గ్రామానికి చెందిన 6 వైసీపీ కుటుంబాలు టీడీపీ ఇన్‌ఛార్జ్ జూలకంటి బ్రహ్మారెడ్డి సమక్షంలో బుధవారం టీడీపీలో చేరారు. టీడీపీ కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ పార్టీలో చేరే ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని చెప్పారు. రాష్ట్రం అభివృద్ధి చెందా లంటే టీడీపీని గెలిపించాలన్నారు. మాచర్లలో అరాచక పాలనను సాగనంపాలని పిలుపు నిచ్చారు. పార్టీలో చేరిన వారిలో బాణావత్ సక్రూ నాయక్, బాణావత్ హేమ నాయక్, రమావత్ నరహరి నాయక్, ముడావత్ బాబ్జి నాయక్, బాణావత్ భీంజీ నాయక్, మారుతీ నాయక్‌లు ఉన్నారు. పసుపులేటి బ్రహ్మానాయుడు, గుండాల శ్రీనివాస్ యాదవ్, రెడ్యా నాయక్, బాబు, స్వామినాయక్, పాల్గొన్నారు.

నగదు, బంగారం పట్టివేత

విశాలాంధ్ర-తాడికొండ : ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. తాడికొండ అడ్డ రోడ్డులో పోలీసులు చెక్ పోస్టుఏర్పాటు చేశారు. నిత్యం తనిఖీలు నిర్వహిస్తున్నారు. వచ్చిపోయే అన్ని రకాల వాహనాలను తనిఖీ చేస్తున్నారు. బుధవారం అమరావతి మండలం తమ్మవరానికి చెందిన మాతంశెట్టి సాంబశివరావు వద్ద రూ.74,600 స్వాధీనం చేసుకున్నారు. అలాగే మరో వ్యక్తి వద్ద 700 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు విచారిస్తున్నారు. పట్టుబడిన నగదు, బంగారాన్ని ఐటీ అధికారులకు పంపిస్తున్నట్లు తెలిసింది.

మనిషిలో సంతోషానికి సూచిక చిరునవ్వు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : మనిషి జీవిత అంతిమ లక్ష్యం సంతోషంగా ఉండటమేనని ప్రముఖ నాటక రచయిత కాపూరి సత్యన్నారాయణ అన్నారు. ఆనందం వల్ల సానుకూల దృక్పథం పెరిగి సమస్యలను సులభంగా పరిష్కరించుకోగలమని పేర్కొన్నారు. స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో అంతర్జాతీయ సంతోష దినోత్సవం' బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంతోషంగా ఉండే వాళ్ళలో ఆత్మ విశ్వాసం అధికస్థాయిలో ఉంటుందని, కొత్త విషయాలు నేర్చుకోవాలనే ఆసక్తి పెరుగుతుందని అనేక శాస్త్రీయ అధ్యయనాలు పేర్కొంటున్నట్లు వ్యాఖ్యానించారు. హాస్య వల్లరి కో-ఆర్డినేటర్ వీవీ రావ్ మాట్లాడుతూ సంతోషం ప్రాధాన్యతను గుర్తించిన మొదటి దేశం భూటాన్ అని, భూటాన్ దేశంలో జాతీయ ఆదాయం కన్నా జాతీయ సంతోషానికి అధిక ప్రాధాన్యత ఇస్తారని, దీన్ని స్ఫూర్తిగా తీసుకుని 2013 నుంచి ఐక్యరాజ్య సమితి సంతోష ప్రాముఖ్యతను ప్రపంచ వ్యాప్తంగా తెలియజేయటానికి అంతర్జాతీయ సంతోష దినోత్సవాన్ని నిర్వహిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గాయకుడు డీటీ సాయిబాబు, పింగళి భాగ్యలక్ష్మి, పాల్గొన్నారు.

మంగళగిరిలో నారా లోకేష్‌కి విజయ రేఖా లేదు : ఎమ్మెల్యే ఆర్కే

విశాలాంధ్ర-తాడేపల్లి : మంగళగిరిలో నారా లోకేష్‌కి విజయ రేఖా లేదని వైసీపీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) హాట్ కామెంట్స్ చేశారు. బుధవారం సాయంత్రం క్రిస్టియన్ పేట వైసీపీ పట్టణ రూరల్ కార్యాలయంలో వైసీపీ ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంత రావు,మాజీ ఎమ్మెల్యే కాండ్ర కమల, మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థి లావణ్య, సీనియర్ నాయకులు దొంతిరెడ్డి వేమారెడ్డి,పట్టణ రూరల్ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి, అమరా నాగయ్య, ఈదులమూడి డేవిడ్ రాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ మంగళగిరిలో నారా లోకేష్‌కి విజయ రేఖా లేదని విమర్శించారు. బీసీల రాజ్యాధికారం కోసం బీసీ అభ్యర్థి లావణ్యని మంగళగిరిలో గెలిపించాలన్నారు. గత 5 సంవత్సరలలో సియం జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి అందించారన్నారు. మంగళగిరిలో టీడీపీ ఏమి అభివృద్ధి చేసారో చెప్పాలని డిమాండ్ చేశారు.లబ్ది జరిగితేనే ఓటు వేయమని అడిగే దమ్ము ఒక్క జగన్ మోహన్‌రెడికే ఉందన్నారు. గత 5 సంవత్సరల్లో వైసీపీ చేసిన అభివృద్ధిని ప్రజలలోకి తీసుకు వెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంగళగిరిలో మురుగుడు లావణ్యకి 15 వేల ఓట్లు మెజారిటీ రావడం ఖాయమన్నారు.2019లో వైసిపికి మంగళగిరి 7500 వేలు ఓట్లు మైనస్ వచ్చిందని కానీ త్వరలో జరిగే ఎన్నికల్లో సుమారు 5000 వేల ఓట్లు మెజార్టీ వస్తుందని అన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. జిల్లా ఎస్టీ జనరల్ సెక్రటరీ దుర్గారావు, జిల్లా యూత్ జనరల్ సెక్రటరీ పండు, మాజీ కౌన్సిలర్స్, మాజీ ఎంపీటీసీ, సభ్యులు, వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.